క్లుప్తంగా

ఈ-స్టాంప్ కౌంటర్ ప్రారంభం


అంబాజీపేటలో ఈ-స్టాంప్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న సబ్ రిజిస్ట్రార్ శారద

అంబాజీపేట: అంబాజీపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ స్టాంప్ కౌంటర్‌ను స్థానిక సబ్ రిజిస్ట్రార్ పి.శారద కుమారి శుక్రవారం ప్రారంభించారు. కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో పనిచేసే ఈ కౌంటర్ ద్వారా ఆన్‌లైన్, నాన్ జ్యుడీషియల్, ఈ స్టాంపులు పొందవచ్చన్నారు. ఆస్తుల కొనుగోలు, విక్రయాలు, తదితర లావాదేవీలను పూర్తి చేయడానికి, చెల్లింపులు ఆన్‌లైన్‌లో చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వీఎల్‌వీఎన్ ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ మంచికంటి సుబ్బారావు, అసిస్టెంట్ నూకరత్నం, యల్.సురేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓగా రాధాకృష్ణ

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)గా పి.రాధాకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వైద్యారోగ్యశాఖ సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకూ సీహెచ్‌ఓగా పనిచేసిన పి.వెంకటరత్నం సీతానగరం పీహెచ్‌సీ వెళ్లిపోయారు. అక్కడ పనిచేస్తున్న రాధాకృష్ణ బదిలీపై పెదపళ్ల పీహెచ్‌సీకి వచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యారోగ్య సేవలను అందించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఎంఈవో-2గా శ్రీనివాసరాజు


శ్రీనివాసరాజు

రావులపాలెం: మండల విద్యా శాఖాధికారి-2గా బైర్రాజు శ్రీనివాసరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తపేట మండలం మోడేకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న శ్రీనివాసరాజు రావులపాలెం మండలం ఎంఈఓ-2గా నియమితులయ్యారు.

ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్‌గా సురేష్

అంబాజీపేట: స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చీఫ్ మేనేజర్‌గా ఎం.సురేష్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. స్థానిక బ్రాంచి స్కేల్ 3 నుంచి 4కు అప్‌గ్రేడ్ కావడంతో అమరావతిలోని లోకల్ హెడ్ ఆఫీసు (ఎల్‌హెచ్‌ఓ) నుంచి తాను బదిలీపై వచ్చానని సురేష్ తెలిపారు. ఖాతాదారుల సిబ్బంది సహకారంతో అంబాజీపేట బ్రాంచ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని సురేష్ చెప్పారు. ఇంతవరకు పనిచేసిన బ్రాంచి మేనేజర్ రాజా రాజమహేంద్రవరం రీజియన్‌కు బదిలీ అయ్యారు.

ఎస్‌బీఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు

అయినవిల్లి: ఎస్‌బీఐ ఖాతాదారులకు ఇప్పుడు మెరుగైన సేవలందిస్తున్నట్టు అమలాపురం ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ గున్నేశ్వరరావు అన్నారు. ముక్తేశ్వరం ఎస్‌బీఐ బ్రాంచ్ పరిధిలోని తొత్తరమూడిలో గురువారం రాత్రి శిబిర్ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రీజినల్ మేనేజర్ గున్నేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్‌బీఐ బ్రాంచ్ ద్వారా అందిస్తున్న వ్యవసాయ రుణాలను, వివిధ రుణాలను, వివిధ సేవలను ఖాతాదారులకు వివరించారు. నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వారా జయసావిత్రి, ఎస్‌బీఐ ముక్తేశ్వరం బ్రాంచ్ మేనేజర్ కేవీ దినేష్ కుమార్ చేనేత సంఘం నాయకులు అంకం వీర్రాజు తదితరులు ఉన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

అయినవిల్లి: మండలం ముక్తేశ్వరం దేవీగణేష్ థియేటర్ వద్ద హెచ్ఐవీ బాధిత చిన్నారులకు జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోషకాహార కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. శ్రీ రామానంద చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చిక్కం సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఆకుల రాము, జి.రిశ్వక్‌ల సౌజన్యంతో సమకూర్చిన కిట్లను రోగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల గౌరవ అధ్యక్షుడు వంటిద్దు వెంకన్న నాయుడు, జల్లి సుజాత, స్థానిక జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, కడలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల ఏర్పాటు చరిత్రాత్మకం

- 154 మందికి రూ.8 కోట్ల విలువైన స్థలాలు
- రూ.9.2 లక్షలతో దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు


పినపళ్లలో లబ్ధిదారులైన మహిళలకు పసుపు, కుంకుమలతో ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: నియోజకవర్గంలో అర్హులైన సుమారు 17 వేల మంది లబ్ధిదారులందరికీ వైఎస్సార్ జగనన్న కాలనీ పథకం కింద దశల వారీగా అందిస్తున్న ఇళ్ల పట్టాలు పంపిణీ జాతీయ స్థాయిలో చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పినపళ్ల, పెదపళ్ల గ్రామాల్లోని 154 మంది లబ్ధిదారులైన మహిళలకు ఆడపడుచు కట్నంగా పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, గాజులతో సుమారు రూ.8 కోట్ల విలువైన ఇళ్ల పట్టాలను శుక్రవారం అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, మాజీ సర్పంచ్ కోట బూరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు సంగిత సుభాష్, యేడిద సత్యశ్రీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు ఎక్కడా అంటూ విమర్శలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలు సిగ్గుపడే విధంగా రూ.కోట్ల విలువైన ఇళ్ల స్థలాలను సీఎం జగన్ పేదలకు పంపిణీ చేస్తున్నారన్నారు. ఇళ్ల స్థలాలు పంపిణీయే కాకుండా ప్రభుత్వ ఆర్థికసాయంతో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో ఇళ్లను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆత్రేయపురం మండలంలోని తాడిపూడి, కొత్తపేట మండలంలోని అవిడి, రావులపాలెం మండలంలోని దేవరపల్లి గ్రామాల్లో వేలాది మంది లబ్ధిదారులకు స్థలాలు పంపిణీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రైవేటు లే అవుట్లకు ధీటుగా ప్రభుత్వ వ్యయంతో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు.

రూ.42.2 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు

ఆలమూరులో రూ 42.2 లక్షలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శ్రీకారం చుట్టారు. స్థానిక బస్టాండు సెంటర్ ఎదురుగా సుమారు రూ.33 లక్షలతో నిర్మించిన తొమ్మిది షాపులను ఆయన ప్రారంభించారు. అలాగే విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు)కు రూ 9.2 లక్షల విలువైన పది త్రిచక్ర వాహనాలను అందజేశారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి లబ్ధిదారులైన దివ్యాంగులతో కలసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీలు నెక్కంటి ప్రమీల, పెదిరెడ్డి పట్టాభి, పార్టీ నాయకులు చామకూరి శ్రీనివాసు, విజ్జన అబ్బు, పాలింగి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన

ఆలమూరు: ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దక్షత దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరులోని ఎస్సీ పేటలో శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదవ విడత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'జగనన్న సురక్ష'ని సద్వినియోగం చేసుకోవాలి

సాంకేతిక కారణాలలో సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులు సత్వరమే శనివారం గ్రామ సచివాలయాల్లో ప్రారంభం కానున్న జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి కోరారు. స్థానిక ఎస్సీ పేటలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా నున్న సమస్యలను తీర్చిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఎంఏఏఎస్ అధ్యక్షులు యనమదల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు, వనుం చిన్నావతి, చల్లా నానాజీ, నాతి కుమార్‌రాజా పాల్గొన్నారు.

సాత్విక్‌కు రాష్ట్ర స్థాయిలో 220వ ర్యాంకు


సాత్విక్ నాయుడు

పి.గన్నవరం: మండలంలోని కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన బోనం సాత్విక్ నాయుడు ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో 220 వ ర్యాంకు సాధించాడు. శుక్రవారం రాత్రి రాష్ట్ర స్థాయి ర్యాంకులు విడుదల అయ్యాయని సాత్విక్ తెలిపాడు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 660 మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 4460, ఓసీ జనరల్ కేటగిరిలో 2427 వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు శ్యామల, సత్యనారాయణమూర్తి, సోదరుడు నాగపవన్‌ల ప్రోత్సాహంతో ఈ ర్యాంకులను సాధించానని సాత్విక్ తెలిపాడు. ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి, న్యూరాలజిస్ట్ కావాలన్నదే తన లక్ష్యమని తెలిపాడు.

విద్యుత్ లైన్లు ధ్వంసం

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం కొబ్బరి చెట్లు విరిగిపడిన ఘటనలో విద్యుత్ లైన్లు ధ్వంసమయ్యాయి. దీని వల్ల మూడు లెవెన్ కేవీ విద్యుత్ పోల్స్ దెబ్బతిన్నట్టు ఆ శాఖ సిబ్బంది తెలిపారు. అలాగే 6 స్పాన్ కండక్టర్ కట్ అయినట్టు, మూడు గ్రామాలకు సరఫరాలో లోపాలు తలెత్తినట్టు ఆ శాఖ సిబ్బంది వెల్లడించారు.

లైఫ్ ఈజ్ ప్రీషియస్ ప్రోగ్రాం

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంకలో మదర్ థెరిసా నర్సింగ్ కళాశాలలో శుక్రవారం లైఫ్ ఈజ్ ప్రీషియస్ (జీవిత విలువలు తెలుసుకుని ఆత్మస్థైర్యంతో ఎదగాలి) ప్రోగ్రాం యాజమాన్యం చేసింది. ఈ సందర్భంగా స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన పై ప్రోగ్రాం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కడలి గిరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. రిసోర్స్ పర్సన్లుగా కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్‌బాబు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పీవీవీ వరప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే స్పందన ఫౌండేషన్ పని చేస్తోందన్నారు.

విద్యార్థులకు అమ్మఒడి చెక్కుల పంపిణీ


ముక్తేశ్వరంలో అమ్మఒడి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కె.చిట్టిబాబు, ఎంపీ చింతా అనురాధ

అయినవిల్లి: జగనన్న అమ్మఒడి పథకంలో మండలంలోని 5380 మంది విద్యార్థులకు రూ.8.07 కోట్లు పంపిణీ చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, అమలాపురం ఎంపీ చింతా అనురాధ తెలిపారు. ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న అమ్మఒడి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టిబాబు, ఎంపీ అనురాధలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ సీఎం జగన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు అనేక వసతులు అందించారన్నారు. విద్యార్థులకు అనేక ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అమ్మఒడి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, పార్టీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ (పండు), కుడుపూడి విద్యాసాగర్, కుసుమ సునీల్, మట్టపర్తి రామారావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన విద్యనందిస్తున్నాం


మామిడికుదురులో అమ్మఒడి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: పేదలకు నాణ్యమైన విద్య నందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా రాజోలు నియోజవర్గంలోని ఏడు గ్రామాలకు చెందిన 1834 మంది విద్యార్థులకు రూ.2.75 లక్షలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా మాజీ సీఎం రాజశేఖరరెడ్డి ఎంతో మందికి ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కల్పించడంతో పాటు మంచి భవిష్యత్ అందించారన్నారు. అదే బాటలో అతని తనయుడు జగన్ కూడా పలు పథకాల ద్వారా నాణ్యమైన విద్యనందిస్తున్నారని చెప్పారు. జగన్ ప్రవేశ పెట్టిన ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకం కలికితురాయిగా నిలుస్తుందని వరప్రసాదరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, బొలిశెట్టి భగవాన్, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, సూరిశెట్టి బాబి, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓలు కోన హెలీనా, మోకా వెంకన్నబాబు, హెచ్‌ఎం సీహెచ్ నిరంజని తదితరులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలకు తెరలేపిన టీడీపీ

వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం


కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు, సర్పంచ్ చంటి తదితరులు

కొత్తపేట: ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న అధికార వైఎస్సార్ సీపీపై ఆరోపణలు చేయడానికి టీడీపీ నాయకులకు ఏ సబ్జెక్టు లేక శవ రాజకీయాలకు తెరలేపారని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, మోడేకుర్రు పీడీసీ కన్వీనర్ కుడుపూడి వెంకటేశ్వరరావు శుక్రవారం సాయంత్రం కొత్తపేటలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మోడుకుర్రులో మేడిశెట్టి శ్యామ్ మణికంఠ రామ్‌ప్రసాద్ వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటే రాజకీయం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎంతో భవిష్యత్ ఉన్న శ్యామ్ మణికంఠ ఆత్మహత్యకు పాల్పడటం విచారకరమన్నారు. సెల్ఫీ వీడియోలో తల్లిదండ్రులకు సారీ చెప్పి శ్యామ్ ఆత్మహత్య చేసుకున్నాడని డీఎస్పీ దర్యాప్తులో తేలిందన్నారు. దీనిని రాజకీయం చేయడం మంచిది కాదని ఆ గ్రామంలో టీడీపీ వార్డు సభ్యుడు అన్నారన్న విషయాన్ని ప్రస్తావించారు. యువకుడు మృతిపై అధికార పార్టీ ప్రతినిధులు స్పందించలేదని, పరామర్శించలేదని పేర్కొనడాన్ని వెంకటేశ్వరరావు ఖండించారు. మృతుడికి పంచనామా పూర్తయ్యే వరకూ ఆ గ్రామ సర్పంచ్ కె.రామలక్ష్మి భర్త వెంటే ఉన్నారన్నారు. ఇప్పటికైనా శవ రాజకీయాలు ప్రతిపక్ష నాయకులకు హితవు పలికారు. సమావేశంలో ఖండ్రిగ బీడీసీ కన్వీనర్ డి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పితాని రాంబాబు, బొక్కా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం

పి.గన్నవరం/సఖినేటిపల్లి/అంబాజీపేట/రావులపాలెం: నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరంలోని గ్రేస్ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఉదయం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభిస్తారని ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. సంక్షేమ పథకాల కోసం అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఈ కార్యక్రమం ప్రజలకు ఉచితంగా అందజేస్తారని ఆమె వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఆమె తెలిపారు. మండలంలో వివిధ సచివాలయాల్లో శనివారం నుంచి జగనన్న సురక్ష క్యాంపులు ప్రారంభం కానున్నట్టు ఎంపీడీవో జి.భీమారావు శుక్రవారం తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించి మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాలను శుక్రవారం ఆయన సందర్శించి జగనన్న సురక్షపై పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలో శనివారం నుంచి జూలై 26 తేదీ వరకు ఆయా గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు.

27 వరకూ జగనన్న సురక్ష కార్యక్రమాలు..

మండలంలో జూలై 27 వరకూ జగనన్న సురక్ష కార్యక్రమాలు సచివాలయాల వారీగా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ భారతి తెలిపారు. దీని కోసం మండల స్థాయిలో రెండు టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. పలు తేదీల్లో ఆయా ఎంపీడీవోలు తెలిపిన ప్రకారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఆయా ఎంపీడీఓలు వివరించారు.

సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎంను ఆశీర్వదించండి

మామిడికుదురు: సంక్షేమ పథకాలు అందిస్తూ అందరి అభివృద్ధిని కాంక్షిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం పెదపట్నంలంకలో జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఎమ్మెల్యే చిట్టిబాబు చెప్పారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా నేరుగా ప్రజలకే సంక్షేమ పథకాలు అందే విధంగా వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టామన్నారు. మీ చల్లని దీవెనలు అందించి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పార్టీ నేతలు రాయుడు ఆనంద్, విప్పర్తి నాగేశ్వరరావు, కొమ్ముల సూరిబాబు, ఒంటిద్దు నారాయణరావు, కొమ్ముల గోపాలకృష్ణ, బండారు బాబులు, కొమ్ముల పెద్దకాపు, బయ్యా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలన్నదే జగనన్న లక్ష్యం

సఖినేటిపల్లి: అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం అప్పనరామునిలంకలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, పీఏసీఎస్ అధ్యక్షులు దివ్వి చిట్టిబాబు, కూనపరెడ్డి రాంబాబు, మాజీ సర్పంచ్ మంగెన వెంకట స్వామినాయుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు బర్రె రాము, నాయకులు కె.చిట్టిబాబు, గెద్దం అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

కరవాకలో ఓఎన్జీసీ వాహనాల నిలుపుదల

మామిడికుదురు: గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కరవాక గ్రామస్తులు ఓఎన్జీసీ వాహనాలను అడ్డుకుని శుక్రవారం నిరసన తెలిపారు. గ్రామంలో సుమారు 20 బావుల ద్వారా క్రూడాయిల్‌ను వెలికితీస్తున్న ఓఎన్జీసీ తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు ఆందోళన వ్యక్తం చేశారు. క్రూడాయిల్ వ్యర్థాల వల్ల సముద్రంలో చేపలు చనిపోయి తమ ఉపాధికి ఆటంకం ఏర్పడుతోందని 2018లో ఓఎన్జీసీకి వ్యతిరేకంగా తాము ఆందోళన చేశామన్నారు. దీంతో సీఎస్ఆర్ పేరిట రూ.93 లక్షలు నిధులు ఇచ్చేందుకు ఓఎన్జీసీ హామీ ఇచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని కేవలం 77 మందికే ఇస్తామని చెబుతున్నారని, కానీ గ్రామంలో ఉన్న 650 మత్స్యకార కుటుంబాలకు ఈ సహాయం అందించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు నిరసన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో సందాడి పార్థీశ్వరవర్మ, అంగాని సుబ్బారావు, సందాడి ఏసుబాబు, రేకాడి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాల కేంద్రాలతో లాభాలెన్నో..

అంబాజీపేట: జగనన్న పాల కేంద్రాలతో పాడి రైతులకు లాభం, గౌరవం లభిస్తుందని సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, పశువైద్యాధికారి డి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇసుకపూడిలో శుక్రవారం జగనన్న పాల వెల్లువ కేంద్రాలకు పాలు పోయడం వల్ల కలిగే లాభాలను పాడి రైతులకు వివరించారు. పశువైద్యాధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాలు పోస్తే రైతులకు 11 వెన్న శాతం వస్తే లీటరు పాలకు రూ.88 వరకు అత్యధిక ధర ఇస్తారన్నారు. కేవలం రూ.384 చెల్లిస్తే మూడేళ్ల పాటు పశువుకు రూ.30 వేలు బీమా పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో రూట్ ఇన్‌చార్జి మౌనిక, డీఆర్‌డీఏ గంగాధర్, వీఏహెచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

అంబాజీపేట: జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అమలవుతున్న వివిధ రకాల వైద్య సేవలపై అంబాజీపేట పీహెచ్‌సీని జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ నవీన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడు అంశాల్లో పలు ఎలిమెంట్స్ పై తనిఖీ చేశారు. దీనిపై నివేదికను కేంద్రానికి నివేదిస్తామన్నారు.

మట్టి, ఇసుక లారీల రాకపోకల అడ్డగింత

పి.గన్నవరం: ప్రధాన పంట కాలువపై శిథిలస్థితిలో ఉన్న యర్రంశెట్టివారిపాలెం వంతెనపై మట్టి, ఇసుక లారీల రాకపోకలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్ యర్రంశెట్టి త్రివేణి ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. లారీల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ వంతెనపై తమ గ్రామ రైతులతో పాటు, పశ్చిమగోదావరి జిల్లా అనగర్లంక, పెదమల్లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని, వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు ఇదే ఆధారమని ఆమె వివరించారు. గత కొన్ని నెలలుగా స్థానిక ర్యాంపుల నుంచి నిత్యం వందలాది లారీల మట్టి, ఇసుకను ఈ వంతెన మీదుగా తరలిస్తున్నారని తెలిపారు. కారణంగా వంతెన కూలిపోయే పరిస్థితిలో ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వంతెన మీదుగా లారీలను వెళ్లనివ్వమని గ్రామస్తులు హెచ్చరించారు. లోడు లారీల నుంచి రోడ్డుపై మట్టి, ఇసుక జారిపడి విద్యార్థులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనకారులతో ఎస్సై హరికోటి శాస్త్రి చర్చించారు. వైవీ పాలెం ర్యాంపు నుంచి ఏటిగట్టు, తాటికాయల వారి పాలెం వంతెన మీదుగా లారీలు వెళ్లేందుకు అవకాశాలను పరిశీలించారు. ఈ మార్గం అనుకూలంగా లేకపోవడంతో విరమించుకున్నారు. ఇదిలా ఉండగా వైవీ పాలెం వంతెనపై లారీలు వెళ్లకుండా గ్రామస్తులు రాళ్లు పాతి, ఇళ్లకు వెళ్లిపోయారు. సాయంత్రం పోలీసుల సమక్షంలో రెవెన్యూ సిబ్బంది రాళ్లను తొలగించడంతో లారీల రాకపోకలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం మళ్లీ ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు. ఆందోళనలో ఉప సర్పంచ్ నారిన సత్తిపండు, నాయకులు యర్రంశెట్టి వీరాస్వామినాయుడు, నారిన రామచంద్రరావు, పెద్దిరెడ్డి సీతారామయ్య, తవిటికి రాంబాబు, సిర్రా ఏసుబాబు, నారిన రమేష్, యర్రంశెట్టి రెడ్డినాయుడు, నూరినీడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.